సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



27 నుంచి నాటిక పోటీలు

భీమవరంలో చైతన్యభారతి సంగీత, నృత్య, నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహించనున్నారు. 8లో ▸



పంచాయతీలకు పురస్కారాలు

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఉత్తమ పంచాయతీలకు అవార్డులు అందజేశారు. 8లో ▸



వ్యక్తి అరెస్ట్

జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ పరిధి గొల్లగూడెంలో ఆంజనేయస్వామి విగ్రహ ధ్వంసం కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: స్పందన కార్యక్రమంలో ఎక్కువగా వస్తున్న ఫిర్యాదులపై సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన 25 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఊర్లెళ్లేవారు బంగారు ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని, సమీప పోలీస్‌స్టేషన్‌లో తెలియజేస్తే గస్తీ ఏర్పాటుచేస్తారన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- తన భర్త, కుమార్తె కలిసి ఆస్తి రాయించుకొని తనను ఇబ్బందులు పెడుతున్నారని వీరవాసరానికి చెందిన మహిళ ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.
- పెంపుడు కొడుకు, కోడలు తనను చంపడానికి చూస్తున్నారని భీమవరం వన్‌టౌన్‌కు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశారు.
- తాను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నానని మెసేజ్‌లో అపరిచిత ఈమెయిల్ రాగా దానిని క్లిక్ చేసి వివరాలు చెప్పడంతో తన బ్యాంకు ఖాతాలోని రూ.లక్ష కాజేశారని మొగల్తూరులో నివాసం ఉంటున్న వ్యక్తి ఎస్పీ వద్ద వాపోయారు.
- తనను గల్ఫ్ పంపిస్తానని డబ్బులు తీసుకుని ఓ వ్యక్తి మోసం చేశాడని, న్యాయం చేయాలని కాళ్లకి చెందిన మహిళ కోరారు.

నేరాల నియంత్రణకు చర్యలు

ఏలూరు టౌన్: జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తామని ఏలూరు ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాడు-నేడు పనులు వేగిరపర్చాలి



ప్రిన్సిపాళ్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీ శ్యామ్‌సుందర్

సాక్షి, భీమవరం: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాడు-నేడు పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఏపీసీ శ్యామ్‌సుందర్, డీఇఇ బీహెచ్ శక్తీశ్వరరావు అన్నారు. స్థానిక గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖాధికారి కేవీ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్ల సమావేశంలో వారు మాట్లాడారు. కళాశాలల్లో అభివృద్ధి పనులపై కలెక్టర్ పి.ప్రశాంతి ప్రత్యేక దృష్టి సారించారని, ఈ మేరకు పనులకు ప్రాధాన్యమిచ్చి వేగంగా పూర్తిచేయడానికి కృషి చేయాలన్నారు. జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు.

వరివడిగా కొనుగోళ్లు

- ఉమ్మడి జిల్లాలో రూ.199.93 కోట్ల విలువైన ధాన్యం సేకరణ
- సజావుగా ఆర్‌బీకేల ద్వారా ప్రక్రియ
- 293 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- 8.38 లక్షల టన్నుల దిగుబడి అంచనా



తాడేపల్లిగూడెం మండలం పుల్లాయగూడెంలో ధాన్యం పట్టుబడి చేస్తున్న రైతులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రాష్ట్రంలో అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం విత్తు నుంచి పంటల కొనుగోళ్ల వరకూ అన్నింటా అండగా నిలుస్తోంది. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు అందించి వ్యవసాయాన్ని పండుగ చేస్తోంది. దీనిలో భాగంగా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తోంది. ధాన్యాగారంగా పేరొందిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ధాన్యం విక్రయాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

దాళ్వాపై ప్రత్యేక దృష్టి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాళ్వా దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. రెండు జిల్లాల్లో సుమారు 8,38,326 టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేసి కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రెండు జిల్లాలోనూ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ధాన్యం సేకరిస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రెండు జిల్లాలోనూ ధ్యానం కొనుగోళ్లకు అవసరమైన గోనె సంచులను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డివిజన్ల పరిధిలో 1,98,326 టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేశారు. 136 రైతు భరోసా కేంద్రాలు, 72 సహకార సంఘాల ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే 73 రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు ప్రారంభించారు. 2,464 మంది రైతుల నుంచి సుమారు రూ.60.93 కోట్ల విలువైన 30,090 టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ముందస్తు చర్యల్లో భాగంగా గోనె సంచులను ఏర్పాటు చేసుకుని ధాన్యం ఉత్పత్తి అవుతున్న ప్రాంతాలకు ముందుగానే సరఫరా చేస్తున్నారు. అలాగే సైక్లింగ్ పద్ధతిలో గోనె సంచులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ధాన్యం కొనుగోళ్లు ఇలా..

ఏలూరు జిల్లా	
ఉత్పత్తి అంచనా	1,98,326 టన్నులు
కొనుగోలు కేంద్రాల ప్రారంభం	73
సేకరించిన ధాన్యం	30,090
విక్రయించిన రైతులు	2,464
కొనుగోలు చేసిన ధాన్యం విలువ	రూ.60.93 కోట్లు
పశ్చిమగోదావరి జిల్లా	
ఉత్పత్తి అంచనా	6,40,000 టన్నులు
కొనుగోలు కేంద్రాల ప్రారంభం	220
సేకరించిన ధాన్యం	68,124
కొనుగోలు చేసిన ధాన్యం విలువ	రూ.139 కోట్లు
విక్రయించిన రైతులు	7,052

పశ్చిమగోదావరిలో..

పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 6.40 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేయగా 364 రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఇప్పటికే 220 రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 68,124 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 7,052 మంది రైతుల నుంచి రూ.139 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించారు. ప్రస్తుతం 100 కిలోల కామన్ రకానికి రూ.2,040, ఏ-గ్రేడ్ రకానికి రూ.2,060గా ప్రభుత్వం ధర నిర్ణయించింది. ధాన్యం తేమ కూడా 17 శాతానికి మించకుండా ఉండేలా చర్యలు తీసుకుంది.

ఇబ్బందులు లేకుండా..



రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేరుగా ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం రైతులు ఉత్పత్తి చేస్తున్న ఆయా ప్రాంతాల నుంచి ధాన్యం సేకరిస్తున్నాం. ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు 30 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

– బి.లావణ్యవేణి, జేసీ, ఏలూరు జిల్లా

రైతుల నుంచి నేరుగా..




దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే 68,124 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కళ్లాల వద్దకే సిబ్బందిని పంపించి ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేస్తున్నాం.

– ఎస్.రామసుందర్‌రెడ్డి, జేసీ, పశ్చిమగోదావరి జిల్లా

విద్యుత్ శాఖలో కలకలం

నకిలీల వ్యవహారంపై సీఎండీ దృష్టి



సాక్షి ఎఫెక్ట్

తణుకు: ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలను 'విద్యుత్ శాఖలో నకిలీలు' శీర్షికతో ఈనెల 23న 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. దీంతో విద్యుత్ శాఖలో నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు పొందిన ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వీరికి ఉద్యోగాలు రావడంలో అప్పట్లో సహకరించిన ఉద్యోగుల్లో సైతం ఆందోళన నెలకొంది. గతేడాది మార్చి 31న వీఆర్ఎస్ తీసుకుని రిటైర్ అయిన ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఉన్నతాధికారి పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుని ఈ వ్యవహారాన్ని చక్కబెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారంతా కలిసి పెద్ద మొత్తంలో ముట్టజెప్పినట్లుగా అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఫైనాన్స్ క్లియరెన్స్ విషయంలో సైతం ప్రస్తుతం ఉన్న అధికారిపైనా నకిలీలు ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే 'సాక్షి' కథనంపై ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వీతేజ్ స్పందించారు. అక్రమ మార్గంలో ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగుల వివరాలను తెలియజేయాలని అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. అక్రమంగా ఉద్యోగంలో చేరడం ఎంత నేరమో దీనికి సహకరించిన ఇంటి దొంగలపైనా చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

సీఎం జగన్‌పై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



నరసాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన, నాయకత్వంపై రాష్ట్ర ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 17న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపట్టగా 15 రోజుల్లో రాష్ట్రంలో 1.65 కోట్ల కుటుంబాలను కలవాలని లక్ష్యం కాగా ఇప్పటివరకూ కోటి కుటుంబాలను కలిశారన్నారు. 79 లక్షల కుటుంబాలు సీఎం జగన్ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ మిస్డ్‌కాల్ ఇచ్చారన్నారు. ప్రజల అవసరాలు ఇంకేమైనా ఉన్నాయా? అనే ఆలోచనతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రూపొందించారన్నారు.

50 వేల కుటుంబాలను కలిశాం

నరసాపురం నియోజకవర్గంలో 70 వేల కుటుంబాలు ఉండగా ఇప్పటివరకూ 50 వేల కుటుంబాలను కలిశామని చీఫ్ విప్ ముదునూరి అన్నారు. వీరిలో 28,500 కుటుంబాలు మిస్డ్‌కాల్స్ రూపంలో ప్రభుత్వానికి అండగా నిలిచాయన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కూడా నరసాపురం నియోజకవర్గంలో రాష్ట్రంలో మొదటిసారి పూర్తయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో 2,200 సమస్యలపై ఫిర్యాదులు రాగా ఇప్పటివరకూ 1,800 సమస్యలను పరిష్కరించామన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, భవిష్యత్‌లో మరింత మెరుగైన పాలన లక్ష్యంగా ముందుకు వెళుతున్న సీఎం జగన్‌కు అందరూ అండగా నిలవాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాబ్జి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు బూసరపు జయ, దొంగ మురళీకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్లు, గోరు సత్తిబాబు, తిరుమాని కృష్ణంరాజు, కడలి రాంబాబు పాల్గొన్నారు.

బాధితురాలికి మెరుగైన వైద్య సాయం

ఏలూరు (టూటౌన్): ప్రేమోన్మాది దాడికి గురైన బాధితురాలికి మెరుగైన వైద్య, న్యాయ సహాయాలు అందజేస్తామని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రీజనల్ ఆర్గనైజర్ వి.సాయిబాల పద్మ అన్నారు. స్థానిక ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఆర్‌జేడీ కె.ఉమారాణితో కలిసి ఆమె పరామర్శించారు. బాధితురాలు, కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని మెరుగైన వైద్యం అందజేయాలని కోరారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న దిశా వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది బాధితురాలికి వైద్య, న్యాయపరమైన సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. రీజనల్ నోడల్ ఆఫీసర్ స్వరాజ్య లక్ష్మి, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ చుక్క నిర్మల తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఇకపై 'జగనన్నకు చెబుదాం'

- అర్జీదారులకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వాయిస్ మెసేజ్
- కలెక్టర్ ప్రశాంతి వెల్లడి



నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం త్వరలో జగనన్నకు చెబుదాం పేరుతో సాగనుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జగనన్నకు చెబుదాం పేరుతో సాగే కార్యక్రమం ద్వారా ఇకపై అర్జీదారులకు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) నుంచి ఫోన్‌లో వాయిస్ మెసేజ్ వస్తుందన్నారు. అలాగే అర్జీలు, ఫిర్యాదులు, దరఖాస్తులను ఎప్పటికప్పుడు సీఎంఓ నుంచి పర్యవేక్షిస్తారన్నారు. స్పందన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 120 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. భూతగాదాలు, రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలపై ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ఆయా సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించడానికే ప్రతి వారం ఈ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. స్పందన దరఖాస్తుల అంశంపై తనకు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ డి.అఖిల, నరసాపురం డీఎస్పీ కె.రవిమనోహరాచారి పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన పెంచాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు మంగళవారం జాతీయ మలేరియా దినోత్సవాన్ని సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్షించారు. మలేరియాకు ప్రధాన కారణం అపరిశుభ్రత అని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వరి పంట కోతకు వచ్చిన ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు.

ఉద్యోగులు హెల్మెట్ ధరించాలి

నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ మాట్లాడుతూ ఆఫీసులకు ద్విచక్రవాహనాల్లో విధులకు హాజరయ్యే ఉద్యోగులు కచ్చితంగా హెల్మెట్ ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఆప్షన్ త్రీ లబ్ధిదారులు వెంటనే బ్యాంకు ఖాతాలు తెరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆశ

ఏలూరు టౌన్: ప్రపంచ దేశాల్లో అత్యంత సమస్యాత్మకంగా ఉన్న మలేరియాను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపడుతున్నాయని ఏలూరు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.ఆశ తెలిపారు. స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో సోమవారం జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా 106 దేశాల్లో మలేరియా ప్రజలను ఇబ్బంది పెడుతుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2007 నుంచి ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించిందన్నారు. మలేరియా జ్వరం ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల వస్తుందని, ఈ దోమ పెరిగేందుకు అనువైన వాతావరణం ఏజెన్సీ ప్రాంతంలో ఉంటుందన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియా నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల్లో మలేరియా పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు మందులు ఇస్తారని తెలిపారు. సీఎస్‌సీడీ వైద్యాధికారి ప్రియాంక, ఏఎంఓ పి.శ్రీనివాస్, జె.గోవిందరావు, ఎంపీహెచ్ఈఓ బసవరాజు, హెల్త్ అసిస్టెంట్స్ రమేష్ ,శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద పిల్లలకు ప్రైవేట్ చదువు

- కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య
- తొలి విడతలో 156 మందికి ప్రవేశాలు
- తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 38 మంది చేరిక



పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చిన్నారులు

సాక్షి, భీమవరం: విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా జిల్లాలోని 20 మండలాల్లో 156 మంది విద్యార్థులు సీట్లు దక్కించుకున్నారు. ఒకటో తరగతిలో ప్రవేశాల పొందిన విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. గతంలో ఉన్నత వర్గాలకు పరిమితమైన 'ప్రైవేట్' విద్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లలకూ చేరువ చేశారు.

250 స్కూళ్ల అంగీకారం : జిల్లావ్యాప్తంగా 358 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా వాటిలో 25 శాతం సీట్లను ఉచిత విద్యకు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించారు. ఇందుకు 250 పాఠశాలల యాజమాన్యాలు అంగీకరించి విద్యాశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. 5 ఏళ్లు నిండిన వారికి మాత్రమే ఒకటో తరగతిలో ప్రవేశం కల్పిస్తుండగా రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. ఆడ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 6 శాతం సీట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైన పిల్లలు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ మేరకు జిల్లాలో 156 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోగా విద్యాశాఖ అధికారులు ఈనెల 12న వారి అర్హతలను నిర్ధారించి 13న లాటరీ ద్వారా మొదటి విడత ఎంపిక పూర్తిచేశారు.

మండలాల వారీగా ఎంపిక

మండలం	విద్యార్థులు	మండలం	విద్యార్థులు
తాడేపల్లిగూడెం	38	మొగల్తూరు	01
పాలకొల్లు	30	నరసాపురం	05
భీమవరం	16	పాలకోడేరు	02
ఆచంట	12	పెంటపాడు	02
ఆకివీడు	01	పెనుగొండ	03
అత్తిలి	09	పెనుమంట్ర	07
యలమంచిలి	01	తణుకు	06
ఇరగవరం	04	ఉండి	06
కాళ్ల	03	వీరవాసరం	10

పారదర్శకంగా ఎంపిక



జిల్లాలో మొదటి విడతలో 156 మంది లబ్ధి పొందారు. వివిధ స్కూళ్లకు విద్యార్థులను లాటరీ ద్వారా పారదర్శకంగా ఎంపిక చేశాం. రెండో విడత ఎంపిక చేయాల్సి ఉంది. ఎంపికైన విద్యార్థులను ఆయా స్కూళ్లు చేర్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే ఎటువంటి ఫీజులు వసూలు చేసినా చర్యలు తప్పవు. వీటి పర్యవేక్షణను మండల విద్యాశాఖాధికారులకు అప్పగించాం.

–ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

సర్రాజు మృతి తీరనిలోటు



సర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ధర్మాన, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, ఎమ్మెల్యే గ్రంధి

కాళ్ల: క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు మృతి పార్టీకి తీరని లోటని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. భీమవరంలోని సర్రాజు నివాసంలో సోమవారం ఆయన కుమారులు పాతపాటి వాసు, వర్మను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. సర్రాజు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కుటుంబసభ్యులతో కొద్దిసేపు మాట్లాడి సానుభూతిని తెలిపారు. అనంతరం సర్రాజు చిత్రపటానికి పూలమాలవేసి ఆయన నివాళులర్పించారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, జిల్లాపరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, గోకరాజు రామరాజు, గాదిరాజు సుబ్బరాజు, పెన్మెత్స గోపాలకృష్ణంరాజు, సర్పంచ్‌ల చాంబర్ జిల్లా అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరావు, జామి హైమావతి, గులిపల్లి అచ్చారావు, మేకా పార్వతి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్ స్వాధీనం



గుండుగొలను వద్ద వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

భీమడోలు: తణుకు నుంచి కొల్లేరు ప్రాంతానికి చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఓ వ్యాన్‌ను గుండుగొలను వద్ద సోమవారం భీమడోలు పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌ను అరెస్ట్ చేసి వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిడమర్రు మండలం తోకలపల్లికి చెందిన వ్యాన్ డ్రైవర్, క్లీనర్ సైదు దయానంద, ముంగర నరసింహం తణుకు నుంచి మూడు క్వింటాళ్ల చికెన్ వ్యర్థాలను వ్యాన్‌లో కొల్లేరు గ్రామాలకు తరలిస్తుండగా భీమడోలు పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌పై కేసు నమోదు చేసారు. చికెన్ వ్యర్థాల్ని శివారు ప్రాంతంలో ధ్వంసం చేసారు. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెలమూరు పంచాయతీకి అవార్డుల పంట



భీమవరం కలెక్టరేట్‌లో గ్రామ సర్పంచులకు అవార్డులు అందచేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): గ్రామాలలో పారిశుధ్యం, తాగునీరు ప్రజలకు అందినప్పుడే గ్రామాలు సస్యశ్యామలంగా తయారవుతాయని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ పంచాయతీలకు అవార్డులు అందజేశారు. జిల్లా, మండల స్థాయితో పాటు రాష్ట్ర స్థాయిలోనూ పెనుమంట్ర మండలం నెలమూరు పంచాయతీ అవార్డులు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ తడి, పొడి చెత్తను వేరు చేసి సంపద కేంద్రాలకు తరలించాలని అన్నారు. గ్రామాల్లో ఉన్న చెరువులను పునరుద్ధరించి మంచి నీటి సంపదను పెంచి గ్రామాలలోని ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలని సూచించారు. నీరు, వాతావరణం, గాలిని మించిన ఆరోగ్యం ఏమీ లేదని గ్రామాలలో ఈ మూడు ఉంటే ఆ గ్రామ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా తయారవుతారని కలెక్టరు అన్నారు. జిల్లాలో 22 గ్రామ పంచాయతీలకు అవార్డులు రావడం సంతోషంగా ఉందని అన్నారు. వీటితో పాటు బాధ్యత కూడా పెరిగిందని వచ్చే సంవత్సరం ఇంకా ఎక్కువ గ్రామ పంచాయతీలు అవార్డులు సాధించాలని కలెక్టరు పి.ప్రశాంతి ఆకాంక్షించారు.

జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కువ అవార్డులు మన జిల్లాకే రావడం సంతోషకరమని అన్నారు. అవార్డులు పొందిన గ్రామ సర్పంచులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాలలో చెత్తను సంపద కేంద్రాలకు తరలించడంతో పాటు ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని గ్రామాలలో మంచినీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడు స్వచ్ఛమైన మంచినీరు అందించినప్పుడు జీవన ప్రమాణ స్థాయి పెరుగుతుందని చిన్నపిల్లలు వృద్ధులను కాపాడుకోగలుగుతామని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ అంశాల్లో ప్రగతి సాధించిన 22 గ్రామ పంచాయతీల సర్పంచులను సత్కరించారు.

22 పంచాయతీలకు అవార్డులు

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల చేరువలో భాగంగా నిర్దేశించిన తొమ్మిది అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలు అవార్డులకు ఎంపికయ్యాయి. సర్పంచులకు కలెక్టరు, జాయింట్ కలెక్టరు, డీఆర్వో చేతుల మీదుగా అవార్డులు అందజేశారు.

ఏ విభాగంలో అవార్డులు

- జీవనోపాధి మెరుగుపర్చడంలో.. యలమంచిలి మండలం బాడవ, పెనుమంట్ర మండలం మల్లిపూడి, నెలమూరు గ్రామాలు
- ఆరోగ్యవంతమైన గ్రామం కేటగిరీలో.. నరసాపురం మండలం లిఖితపూడి, పెనుమంట్ర మండలం నెలమూరు, నత్తా రామేశ్వరం
- బాలల స్నేహ పూర్వక గ్రామం కేటగిరిలో అత్తిలి మండలం వరదల్లపాలెం, పెనుమంట్ర మండలం నెలమూరు, యలమంచిలి మండలం బాడవ
- పుష్కలమైన నీటి వనరులున్న గ్రామం కేటగిరీలో పెనుమంట్ర మండలం నెలమూరు, తాడేపల్లి గూడెం మండలం చిన్న తాడేపల్లి గ్రామాలు
- పచ్చదనం, పరిశుభ్రతలో.. పాలకోడేరు మండలం విస్సాకోడేరు, పెనుమంట్ర మండలం ఓడూరు, అత్తిలి మండలం దంతుపల్లి
- స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాల విభాగంలో తాడేపల్లిగూడెం మండలం వెంకటరామన్నగూడెం
- సామాజిక భద్రతలో అత్తిలి మండలం మంచిలి, పెనుగొండ మండలం సిద్ధాంతం
- సుపరిపాలన కేటగిరిలో అత్తిలి మండలం దంతుపల్లి, నర్సాపురం మండలం కొప్పర్రు, తాడేపల్లి గూడెం మండలం కృష్ణయ్యపాలెం
- మహిళల స్నేహ పూర్వక గ్రామం, అభివృద్ధికి శ్రీకారం విభాగంలో భీమవరం మండలం దిరుసుమర్రు, తాడేపల్లిగూడెం మండలం చిన్న తాడేపల్లి గ్రామాలు ఉన్నాయి.

సూరప్పగూడెం పంచాయతీకి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సర్పంచ్ వెజ్జు బాలాజీ

భీమడోలు: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో సూరప్పగూడెం సర్పంచ్ వెజ్జు బాలాజీ నాయుడు రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్నారు. పంచాయతీ రాజ్ కమిషనర్ సూర్యకుమారి ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందించారు. సూరప్పగూడెం పంచాయతీ రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన పంచాయతీల్లో తృతీయ స్థానాన్ని సాధించగా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని పొందింది. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడంతో మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. సర్పంచ్ వెజ్జు బాలాజీ నాయుడు మాట్లాడుతూ అవార్డు మరింత బాధ్యత పెంచిందన్నారు. ఇదే స్ఫూర్తితో ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు సహాయ సహకారాలతో గ్రామాభివృద్ధి తన వంతు కృషి చేస్తానన్నారు.

సాంకేతికతలో భారత్ ముందంజ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సాంకేతికంగా భారతదేశం అభివృద్ధి పథంలో నడుస్తోందని, మనదేశంపై ఇతర దేశాలు ఆధారపడుతున్నాయని విజయవాడ దూరదర్శన్ స్టూడియో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డీ.రంగనాథ్ తెలిపారు. సోమవారం స్థానిక సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్, 5జీ కమ్యూనికేషన్ టెక్నాలజీ, చిప్ డిజైన్ తదిర సాంకేతికతను నేర్చుకోవాలని సూచించారు. శాటిలైట్ కమ్యూనికేషన్స్ రంగంలో అనేక స్టార్టప్ సంస్థలు ముందుకు వస్తున్నాయని, అతి తక్కువ వ్యయంతో శాటిలైట్ డిజైన్, లాంచింగ్‌లో విజయం సాధిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రిన్సిపాల్ కే.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన తరువాత అనేక మంది ఉన్నత విద్యాభ్యాసం చేయడానికి ఇతర దేశాలు వెళుతున్నారని, దాని ద్వారా వారి తరువాత తరం వారికి ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. ఈసీఈ హెచ్ఓడీ తూమాటి వెంకటేశ్వర రావు, కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లిఖార్జునుడు, కే హరి రామ కృష్ణంరాజు, కే లక్ష్మీ నారాయణ, ఆర్.సతీష్, ఐ.హేమలత, ఎం.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

27 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు



భీమవరంలో జాతీయ స్థాయి నాటిక పోటీల అహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలోని చైతన్య భారతి సంగీత, నృత్య, నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 16వ జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ చెప్పారు. సోమవారం భీమవరంలో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పద్మభూషణ్ కృష్ణ సాంఘిక నాటకోత్సవాల పేరుతో డీఎన్నార్ కళాశాల ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై మొత్తం ఏడు నాటికలు ప్రదర్శిస్తారన్నారు. 27న ఉషోదయ కళానికేతన్(కత్రపాడు) వారి ప్రక్షాళన, 28న అరవింద ఆర్ట్స్(తాడేపల్లి)వారి వెండి అంచులు, పండు క్రియేషన్స్(కొప్పోలు) వారి పక్కింటి మొగుడు, మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్(చిలకలూరిపేట) వారి మృత్యుపత్రం నాటికలు ప్రదర్శిస్తారు, 29న శ్రీసాయిఆర్ట్స్(కొలకలూరి) వారి ప్రేమతో నాన్న, శర్వాణి సాంస్కృతిక సేవా సంఘం(బొరివంక) వారి కొత్త పరిమళం, మణికంఠ ఆర్ట్స్(పిఠాపురం) వారి కొత్తతరం కొడుకులు, 30న ప్రత్యేక ప్రదర్శనగా అభినయ ఆర్ట్(గుంటూరు) వారి గుప్పెండంత గుండె సాంఘిక నాటకం ప్రదర్శిస్తారని చెప్పారు.

ప్రముఖులకు సన్మానాలు

ప్రారంభం రోజు సంగీత దర్శకుడు కోటి, సినీనటుడు శుభలేక సుధాకర్, నాటక ప్రయోక్త నూతలపాటి సాంబయ్య, సినీ, టీవీ నటి కె.విజయలక్ష్మిలను ఆత్మీయ చైతన్య పురస్కారంతో సత్కరిస్తామన్నారు. నాటకోత్సవాలు ముగింపు సందర్భంగా 30న సినీ నటులు పెమ్మెత్స సుబ్బరాజు, సుబ్బరాయశర్మ, డాక్టర్ అళ్ల గోపాలకృష్ణ గోఖలే, నాటక ప్రయోక్త పంపన దయానందబాబు, నటుడు, దర్శకుడు ఎస్.రవీంద్రరెడ్డిలను ఆత్మీయ చైతన్య పురస్కారంతో సత్కరిస్తామన్నారు. సమావేశంలో చైతన్యభారతి ప్రధాన కార్యదర్శి మంతెన రామకుమార్‌రాజు, ఉపాధ్యక్షుడు కాగిత వెంకటరమణ, వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శి రాయప్రోలు శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

18 బైక్‌లు, కారు వేలం



ద్వారకాతిరుమల పోలీసుస్టేషన్ ఆవరణలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: మండల పరిధిలోని పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో 18 బైక్‌లు, ఒక కారును రూ. 2,15,500కు పాటదారులు దక్కించుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఈ సొమ్ముతో పాటు అదనంగా జీఎస్టీ రూపంలో వచ్చిన రూ.38,790 ట్రెజరీకి జమ చేస్తామని పేర్కొన్నారు. వేలంపాట నిర్వహణలో భీమడోలు సీఐ వెంకటేశ్వరరావు, మోటారు వెహికల్ అధికారులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు నగర శివారు చొదిమెళ్ళ ప్రాంతంలో మోటారు సైకిల్ ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చొదిమెళ్ళకు చెందిన మారగాని సీతమ్మ (75)ఈ నెల 23వ తేది రాత్రి గ్రామకూడలి వద్ద రోడ్డు దాటుతుండగా మోటారుసైకిల్ ఢీకొంది. తీవ్రగాయాలైన వృద్ధురాలిని స్థానికులు ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

చేపల చెరువులో విష ప్రయోగం

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చేపల చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయడంతో చేపలు మృత్యువాత పడ్డాయి. దీనిపై రైతు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అనాకోడేరు గ్రామంలోని సన్యాసిరావు కంపెనీ వద్ద కందుల వీరయ్య 9 ఎకరాల చేపల చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయడంతో చేపలు మృత్యువాత పడ్డాయి. ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దిశ సైబర్ కవచ్ ప్రారంభం



ఏలూరు కలెక్టరేట్‌లో దిశ సైబర్ కవచ్ ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: సైబర్ నేరగాళ్ళు తరుచూ సెల్‌ఫోన్లల్లో డేటాను అపహరించి నేరాలకు పాల్పడుతుంటారని, వాటిని అడ్డుకునే ప్రత్యేకమైన సాంకేతిక పరిజ్ఞానమే దిశ సైబర్ కవచ్ అని ఏలూరు దిశ ఎస్ఐ నిహారిక తెలిపారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని గోదావరి కాన్ఫరెన్స్ హాలు వద్ద ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు దిశ సైబర్ కవచ్‌పై అవగాహన కల్పించారు. వారి సెల్‌ఫోన్లను స్కాన్ చేయడం ద్వారా సైబర్ నేరానికి సంబంధించిన ఏదైనా అప్లికేషన్ సెల్‌ఫోన్లల్లో ఉందా... లేదా అనేది వెంటనే తెలుస్తుందని తెలిపారు. ఏమైనా అప్లికేషన్ ఉంటే వెంటనే జాగ్రత్త పడే అవకాశం ఉండటంతో పాటు సైబర్ నేరాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు.

గురుకులాల్లో దరఖాస్తులకు గడువు పెంపు

టి నరసాపురం: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ఈ నెల 28 వరకు గడువు పొడిగించినట్లు విద్యా సంస్థల ఏలూరు జిల్లా కన్వీనర్ టి.నరసింహస్వామి తెలిపారు. అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5, 6, 7, 8 తరగతులకు, జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరణ గడువు ఈ నెల 24 నుంచి 28 వరకు పొడిగించినట్లు తెలిపారు.

ప్రగతి పథంలో పట్టణాలు



పాలకొల్లు పట్టణం 22 వార్డులో నాలుగేళ్ల క్రితం రోడ్డు దుస్థితి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వేసిన సీసీ రోడ్డు

- గత నాలుగేళ్లలో రూ.189 కోట్ల ఖర్చు
- నిరంతరం సాగుతున్న అభివృద్ధి పనులు

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో అభివృద్ధి పరుగులు పెడుతోంది. జిల్లాలోని భీమవరం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం, తాడేపల్లిగూడెం, ఆకివీడు మున్సిపాలిటీల్లోని వార్డుల్లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. పురపాలక సంఘ నిధులను చక్కగా ఉపయోగిస్తూ పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు వారి పరిధిలోని పట్టణాల అభివృద్ధిపై దృష్టి పెట్టి ప్రతి వార్డులో పర్యటిస్తున్నారు.

గత నాలుగేళ్లల్లో పట్టణాల్లో సీసీ రోడ్ల దగ్గర నుంచి పార్కుల వరకు అభివృద్ధి పనులు జరిగాయి. పట్టణాల్లోని వార్డుల్లో అధ్వానంగా ఉన్న రోడ్ల స్థానంలో కొత్త సీసీ రోడ్లు వేశారు. రోడ్లుపై ప్రవహించే డ్రైనేజీ సమస్యకు స్వస్తిపలికి డ్రెయిన్ల నిర్మాణం చేశారు. సిల్ట్ తొలగిస్తూ వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. కల్వర్టులు నిర్మించారు. తాగునీటి సరఫరాకు సంబంధించి పైపులైన్ పనులు జరిగాయి. ప్రజలు ఉల్లాసంగా గడపడానికి పార్కులు అభివృద్ధి చేశారు. జిల్లాలో ఆరు మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయి.

ఇంతవరకూ రూ.189 కోట్లతో పనులు

జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు సంబంధించి ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.189 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. నిధుల్లో అత్యధికంగా సీసీ రోడ్లు, డ్రెయిన్ల కోసం ఖర్చు చేశారు. కొత్త పనులకు ప్రతిపాదనలు తయారు చేయడం, టెండర్లు పిలిచి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు.



భీమవరం 4 వార్డులో అభివృద్ధి చేసిన పార్క్

ఇంతవరకూ ఆయా మున్సిపాలిటీల్లో ఖర్చు చేసిన నిధులు

మున్సిపాలిటీ	ఖర్చు (రూ.కోట్లలో)
భీమవరం	50
పాలకొల్లు	35
తాడేపల్లిగూడెం	40
తణుకు	40
నర్సాపురం	16
ఆకివీడు	8

రోడ్లు, డ్రైయిన్లు నిర్మించారు



పాలకొల్లు పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. ముఖ్యంగా పట్టణంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. గతంలో అధ్వానంగా ఉన్న రోడ్లు నేడు సీసీ రోడ్లుగా మారాయి. దాంతో పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పాయి.

చినిమిల్లి లక్ష్మణరావు, పాలకొల్లు

పార్కు అభివృద్ధి చేశారు



గతంలో రోడ్లు, డ్రెయిన్లు లేక ఇబ్బంది పడేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా వార్డులో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. దాంతో మాకు ఇబ్బందులు తొలగాయి. వార్డులో పార్క్‌ను కూడా అభివృద్ధి చేశారు.

ఎం.నాగమణి భీమవరం 4 వార్డు

విగ్రహ ధ్వంసం ఘటనలో వ్యక్తి అరెస్టు



పోలీసుల అదుపులో విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ పరిధి గొల్లగూడెం గ్రామంలో ఆంజనేయస్వామి చిన్న విగ్రహం ధ్వంసం చేసిన కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ పి.బాల సురేష్‌బాబు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు వెల్లడించారు. గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠించాలని భావించి చాకిరి సోమరాజు గ్రామంలోని చవల వెంకన్న 3వ కుమారుడు చవల శ్రీనుకు చెందిన భూమిలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని పెట్టాలని నిర్ణయించాడు. దీంతో చవల శ్రీనుకు భూమి నిమిత్తం రూ. 5వేలు చెల్లించి, 2022లో విగ్రహ ప్రతిష్ఠ చేశారని తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ శిలాఫలకంపై చవల పిచ్చయ్య, చవల రాంబాబు, చవల వెంకటేశ్వరరావు పేర్లు ఏర్పాటు చేశారు. చవల వెంకన్న పెద్ద కుమారుడు చవల నాగేశ్వరరావు తన తల్లితండ్రుల పేరును కూడా శిలాఫలకంపై పెట్టాలని గొడవ చేసినప్పటికీ ఆ పేర్లు పెట్టలేదు. దీంతో గ్రామంలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న చిన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని చవలం నాగేశ్వర రావు ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. దీంతో నాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



పోలీసుల అదుపులో నాటు సారా అమ్ముతున్న వ్యక్తులు

టి.నరసాపురం: నాటుసారా అమ్ముతున్న ఇద్దరిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏపిగుంట గ్రామానికి చెందిన తానింకి దుర్గమ్మ, వీరభద్రవరం గ్రామానికి చెందిన చిన్ని ఆంజనేయులు నాటు సారా అమ్ముతూ పట్టుబడ్డారన్నారు. ఒక్కొక్కరి నుంచి 5 లీటర్ల చొప్పున మొత్తం 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితులను చింతలపూడి కోర్టులో హాజరుపరచగా, వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన చెప్పారు.

చేనేత సమస్యలపై 20న ధర్నాలు

ఏలూరు (టూటౌన్): చేనేత రంగం పరిరక్షణ కోసం మే 20న అన్ని జిల్లాల్లోని చేనత, జౌళి శాఖ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏపీ చేనేత కార్మికక సంఘం రాష్ట్ర కమిటీసభ్యులు పిచ్చుక ఆదిశేషు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 21న కర్నూలు జిల్లా శ్రీశైలంలో జరిగిన రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. నేతన్న నేస్తం పథకాన్ని ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి, ఉపవృత్తుల వారికి వర్తింపజేయాలని కోరారు. చేనేత కార్మికులకు ఇంటి నిర్మాణానికి ఇస్తున్న ఆర్థికసాయాన్ని రూ.5 లక్షలకు పెంచాలన్నారు.

క్లుప్తంగా

లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో లక్ష్మీగణపతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైశాఖ మాసం చవితి సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో సోమవారం లక్ష్మీగణపతి స్వామికి, ఉమా చంద్రశేఖర్ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. మూల విరాట్‌లకు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో, పాలతో విశేషఅభిషేకాలు, వివిధ రకాల పుష్పాలతో విశేష అలంకరణలు గావించారు. ఆలయ కోశాధికారి సున్న సుందరరావు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని విశేషపూజలు జరిపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, మహిళా భక్తులు విశేషంగా పాల్గొని పూజలు నిర్వహించారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం


ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి వీరయ్యచౌదరి తదితరులు

తణుకు అర్బన్: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్య చౌదరి అన్నారు. తణుకు ఆర్టీసీ డిపోలో సోమవారం దాతలు సమకూర్చిన ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌ను వీరయ్య చౌదరి చేతులమీదుగా బస్సు కండక్టర్‌లకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం దాతలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో కార్యాలయ సీనియర్ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ ఆర్ బాలసుబ్రహ్మణ్యం, తణుకు డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి, డిపో సీనియర్ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ కె.పున్నయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ సాహెబ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ సిబ్బందికి సత్కారం


పంచాయతీ వాటర్ వర్క్స్ కార్మికుడిని సత్కరిస్తున్న సర్పంచ్ అన్నవరం

తాడేపల్లిగూడెం రూరల్: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని సోమవారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచ్ పోతుల అన్నవరం అధ్యక్షత వహించారు. అనంతరం పంచాయతీ వాటర్ వర్క్స్ సిబ్బందిని సర్పంచ్ అన్నవరం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అత్తంటి సోమశేఖరరావు, వార్డు సభ్యులు దిర్శిపాముల పుష్పవతి, పి.వెంకటేశ్వరస్వామి, ఎమ్పీటీసీ సభ్యులు కె.గోవిందరాజు, పసుమర్తి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు రవిచంద్ర, దివ్య, వీఆర్వో రాజు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంపన్నులకు రాయితీలు.. పేదలపై భారాలు


నీలాద్రిపురం గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కళింగ లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం రూరల్: సంపన్నులకు రాయితీలను ఇస్తూ పేదలపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం భారాలు మోపుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కళింగ లక్ష్మణరావు, మండల కార్యదర్శి ఉల్లింకల జయకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని చినతాడేపల్లి, నీలాద్రిపురం గ్రామాల్లో ఉపాధి కూలీల పనిప్రదేశాల్లో పర్యటించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ గ్రామీణాభివృద్ధిలో పేదలకు ఈ చట్టం ఉపయోగించడం వల్ల చాలా బాగా అభివృద్ధి చెందిందన్నారు. దేశంలో 70 శాతం ఉపాధి కూలీలు ఉన్నారని, పేదలకు ఉపయోగపడే నిధులు కేంద్ర ప్రభుత్వం కోతలు విధిస్తుందని విమర్శించారు. నిధులు తగ్గింపు, పని ప్రదేశాల్లో మెడికల్ కిట్, పనికి కావలసిన పరికరాల కోసం కార్మికులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధి కూలీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాధవరంలో గ్రామంలోని ఉపాధి పని ప్రాంతాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు సందర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు తెగిరిపల్లి పాపారత్నం, మండల కమిటీ సభ్యులు తానేటి నాగేశ్వరరావు, ఇంటి సత్యనారాయణ, ఉప్పాటి వెంకట్రావు, లక్కాకుల సూర్యారావు పాల్గొన్నారు.

దిగుబడులు ఘనం.. కళ్లల్లో ఆనందం

- ఆశాజనకంగా రబీ వరిసాగు
- ఎకరాకు 50 నుంచి 55 బస్తాల దిగుబడి
- నియోజకవర్గంలో పలుచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు


పెంటపాడు ప్రధాన రహదారిపై ధాన్యం ఆరబోసిన రైతులు

పెంటపాడు: రబీ వరిసాగు ఆశాజనకంగా ఉంది. పంట కోతలు, మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది పంట దిగుబడి ఆశించిన స్థాయిలో కన్నా అధికంగా ఉండటంతో రైతుల కళ్లల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. దీనికి తగ్గట్టు రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు అండగా నిలబడి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ధాన్యం కొనుగోలును అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

60 వేల ఎకరాల్లో సాగు

డివిజన్ పరిధిలోని గూడెం మండలంలో 26 వేలు, పెంటపాడు మండలంలోని 22వేలు, గణపవరం మండలంలో 12 వేల ఎకరాలు మొత్తం మూడు మండలాల్లో సాగువిస్తీర్ణం 60వేల ఎకరాలు కాగా రెండున్నర లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ఉంది. ఈ ధాన్యం పట్టుబడికి 66 లక్షల గోనెసంచులు అవసరంగా గుర్తించారు. రోటేషన్ దృష్ట్యా ప్రస్తుతం సంచుల కొరతలేదు. సుమారు ఇప్పటికే 10 లక్షల సంచులు రైతులకు అందించారు. డివిజన్ పరిధిలోని గూడెం, పెంటపాడు, గణపవరం మండలాల్లో 65 రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే 7 శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ఖరీఫ్ కొనుగోలు కేంద్రాల్లో పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, సకాలంలో చేతికి సొమ్ములు రావడంతో రబీలో పండించిన పంటను ఆర్‌బీకేల ద్వారా ఏర్పాటు చేయబడిన కొనుగోలు కేంద్రాల్లో అమ్మడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు.

ముమ్మరంగా వరికోతలు

డివిజన్ పరిధిలోని మెట్టప్రాంతమైన గూడెం మండలంలో దాదాపు మాసూళ్లు పూర్తి కావచ్చాయి. పెంటపాడు, గణపవరం మండలాల్లో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటివరకు 15 నుంచి 20 శాతం కోతలు పూర్తికావడంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు సిద్ధం చేసింది. ఎకరాకు 52 నుంచి 55 బస్తాల దిగుబడి వస్తోంది. ఎండలు ఎక్కువగా ఉండటంతో తేమ శాతం తక్కువగా ఉందని రైతులు తెలిపారు. యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని ఒకటిన్నర రోజులు ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.

65 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో పెంటపాడు, గూడెం, గణపవరం మండలాల్లో 65 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. వీటి ద్వారా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. ప్రభుత్వం నిర్ణయించిన తేమ శాతాన్ని చూసుకొని రైతులు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకెళ్లాలి. రైతులకు అవసరమైన గోనె సంచులు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉన్నాయి. రైతుల సమస్యలు తెలుసుకోవడానికి మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాం. డివిజన్‌లో రెండున్నర లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించాం. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలి

– పి. మురళీకృష్ణ, గూడెండివిజన్ ఏడీఏ వ్యవసాయశాఖ

కృష్ణాపురంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


తాడేపల్లిగూడెం మండలం కృష్ణాపురం గ్రామంలో జరిగిన సభలో మాట్లాడుతున్న వక్తలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం పంచాయతీ పరిధి కృష్ణాపురం గ్రామంలో సోమవారం జాతీయ సేవా పథకం కార్యక్రమం నిర్వహించారు. శశి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ టెక్నోలాజికల్ యూనివర్సిటీ (కాకినాడ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు మాట్లాడుతూ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చి దిద్దడానికి కళాశాల విద్యార్థులు సహకరించాలని కోరారు. అనంతరం కళాశాల విద్యార్థులు ఇంటింటికి తిరిగి నిరుద్యోగం, అక్షరాస్యతపై సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరిపాలన అధికారి ఆర్‌వి.బాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి షేక్ సల్మాన్ బాషా, మహిళా సంక్షేమ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి పాల్గొన్నారు. కాగా, విద్యార్థులను కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ కె.భానుప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు ప్రజల మద్దతు


తణుకులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న గృహసారథులు, వలంటీర్లు


తాడేపల్లిగూడెం మండలం కొత్తూరు గ్రామంలో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొత్తూరు గ్రామంలో సోమవారం జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ నాయకుడు తిరుమల శ్రీనివాసరావు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నది ? లేనిది ?ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ పాలన పట్ల ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ జగన్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తణుకు అర్బన్: తణులో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సోమవారం తణుకు మునిసిపాలిటీ పరిధిలో విశేషంగా నిర్వహించారు. గృహసారథులు తమకు అప్పగించిన ఇళ్లకు వెళ్లి వారికి సంక్షేమ పథకాలను తెలపడంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు తీరుకు సంబంధించి లబ్ధిదారుల అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా వారి ఇంటి గుమ్మానికి జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను అతికించారు. మునిసిపాలిటీలోని 29వ వార్డులో వార్డు ఇన్‌చార్జ్ జీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో గృహసారథులు, వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల పంపిణీతో పాటు, ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు.

వైఎస్సార్ సీపీ నేతలపై నీచ రాజకీయాలు తగవు


పెంటపాడు ఎంపీపీ కార్యాలయం వద్ద సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి, తదితరులు

పెంటపాడు: దాళ్వాపంట దిగుబడులతో ఎంతో సంతోషంగా ఉన్న రైతులను అకాల వర్షం సాకుగా చూపి వైఎస్సార్‌సీపీ నాయకులపై నీచ రాజకీయాలు చేయడం టీడీపీకి తగదని జిల్లా, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు కైగాలశ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్‌లు పేర్కొన్నారు. సోమవారం పెంటపాడు మండల ఎంపీపీ దాసరి హైమావతి క్యాంపు కార్యాలయం వద్ద విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం తెల్లవారు జామున అకాలంగా కొద్దిపాటిగా కురిసిన వర్షాన్ని సాకుగా చూపి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నపైనా, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణపైనా నోటికి వచ్చినట్లు మౌంజీపాడు, కె.పెంటపాడు గ్రామంలో టీడీపీ నాయకులు అవాకులు పేలడం సరికాదన్నారు. రైతే రాజు అనే నానుడిని నిజం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నదే అన్నారు. పంట నష్టపోతే నెలలోపే ఇన్‌పుట్ సబ్సిడీ, తుఫానుల వల్ల పంట నష్టపోతే రైతులు పూర్తి పరిహారం తక్షణం అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. నేడు ముఖ్యమంత్రి జగనన్న హయాంలో రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూసిన సంగతిని టీడీపీ నాయకులు గుర్తించాలన్నారు. వైఎస్సార్ ప్రభుత్వంలో ఎక్కడా సంచుల కొరత రానివ్వబోమని, వాటి కృత్రిమ కొరతను టీడీపీ నాయకులే సృష్టిస్తున్నారని కైగాల, కట్టుబోయిన విమర్శించారు. ఈ సమావేశంలో ఎంపీపీ దాసరి హైమావతి, దర్శిపర్రు ఎంపీటీసీ సభ్యులు తోట నీరీక్షణరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ సువార్తకు విధేయులు కావాలి


సువార్త సభల్లో మాట్లాడుతున్న పాస్టర్ జెర్మీయా, పాల్గొన్న విశ్వాసులు

పెంటపాడు: దేవుని ఆత్మీయ రక్షణ సువార్తకు విశ్వాసులు తప్పక విధేయులు కావాలని హైదరాబాద్ ఇమ్మానియేలు మినిస్ట్రీస్‌కు చెందిన పాస్టర్ జెరిమ్మియా పేర్కొన్నారు. గూడెంలోని కడకట్ల క్రైస్టుమాస్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు నిర్వహించబోయే క్రీస్తు రక్షణ సువార్త కూడికలు కన్వీనర్ బుంగా విద్యాసాగర్ ఆధ్వర్యంలో ప్యారిష్ పాస్టర్ రెవ. జి. చిన్నం రాజు సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్ జెరిమ్మియా మాట్లాడుతూ కడవరి కాలంలో దేవుని ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అలవరచుకొని భక్తిగా జీవనం సాగించాలన్నారు. చర్చి సంఘ సభ్యులు కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా తొలిరోజు భారీ సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. పలు ప్రాంతాలకు చెందిన దైవసేవకులతో పాటు, క్రైస్టుమాస్ లూథరన్ చర్చిసంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యూత్ సభ్యులు, సండే స్కూలు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డిగ్రీ నుంచే పరిశోధనలపై అవగాహన అవసరం


పరిశోధన పేటెంట్‌పై జరిగిన జాతీయ స్థాయి సెమినార్‌లో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: విద్యార్థులు డిగ్రీ నుంచే పరిశోధన పట్ల అవగాహన కలిగి ఉండాలని గీతం యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శివరామకృష్ణ చెప్పారు. సోమవారం తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో నాక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త సహకారంతో కళాశాల ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు 'పరిశోధన పేటెంట్‌గా మార్చడం' అనే అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో ఆయన కీ నోట్ అడ్రస్ చేశారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథి శివరామ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థినుల్లో అంతర్గత నైపుణ్యాలను వెలుగులోకి తీసుకురాగలిగినప్పుడే మంచి తరాలను అందించగలమన్నారు. విజ్ఞానం అనేది డిగ్రీ కొలమానం కాదన్నారు. మనలో ఉండే విజ్ఞానాన్ని పరిశోధన అనే దానిని ఏవిధంగా పేటెంట్‌గా మార్చుకోవాలో తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆది కవి నన్నయ్య యూనివర్సిటీ డీన్ డాక్టర్ రమేష్, సెమినార్ కన్వీనర్ డా.ఎం శ్రీదేవి, కళాశాల చైర్మన్ కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, కోశాధికారి నందిగం సుధాకర్, ఏవో డాక్టర్ డీ సుబ్బారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీహెచ్ హిమబిందు,లతో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు తణుకులో సక్రమ వలసలపై అవగాహన సదస్సు

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థ, ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు తణుకు పద్మశ్రీ ఫంక్షన్ హాలులో సక్రమ వలసలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీఎన్ఆర్టీ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రవాసాంధ్రుల సంక్షేమం, భద్రత, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంతో ప్రవాసాంధ్రులకు అందిస్తున్న ఉచిత సేవల్లో భాగంగా ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్రమ ఏజెంట్ల చేతుల్లో మోసపోతున్న వారి కోసం వలసలు ఎక్కువగా వెళ్తున్న ప్రాంతాల్లో ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, తణుకులో నిర్వహించే ఈ సదస్సులో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జిల్లా అధికార యంత్రాంగం పాల్గొంటారని చెప్పారు. విదేశాలకు వెళ్లాలనుకునే వారు, నియామక ఏజెంట్లు ఈ సదస్సులో పాల్గొని వారికున్న సందేహాలు, అపోహలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

భక్తులకు మెరుగైన సేవలు అందించాలి

సాక్షి, భీమవరం: భక్తులకు మెరుగైన సేవలందించేలా శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయ ధర్మకర్తల మండలి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో ధర్మకర్తలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. భక్తులకు పూర్తిస్థాయిలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగన్నబాబు, ఈఓ యర్రంశెట్టి భద్రాజీ, ధర్మకర్తలు రామాయణం సత్యనారాయణ, ముత్యాల వెంకట రామారావు, చెల్లంకి నాగేషగిరి, మావూరి సుందర్రావు, తాళ్లపూడి భాగ్యలక్ష్మి, కోయ వెంకటలక్ష్మి, గోపిశెట్టి విజయలక్ష్మి, నీలాపు విజయ నాగలక్ష్మి, ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగిరపర్చండి

సాక్షి, భీమవరం: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు-నేడు పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయడానికి కృషి చేయాలని ఏపీసీ శ్యామ్‌సుందర్, డీఈఈ బీహెచ్ శక్తీశ్వర్వరావు అన్నారు. భీమవరంలోని గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి కేవీ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.



పంచాయతీలు గ్రామ స్వరాజ్యాన్ని సాధించాలి


ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో నాయకులకు అవార్డులు అందిస్తున్న అధికారులు

ఇరగవరం: దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని రాష్ట్ర శెట్టిబలిజి కార్పొరేషన్ చైర్మెన్ గుబ్బల తమ్మయ్య అన్నారు. సోమవారం ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన పంచాయతీ రాజ్ దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనరులు పంపిణీ సక్రమంగా జరగడానికి మెరుగు పర్చడాకి పంచాయతీ రాజ్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. గ్రామీణ ప్రజల దైనందిన జీవితంలో సత్వర సేవలు కోసం పంచాయతీలు ఉన్నాయన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా 12 గ్రామా పంచాయతీలకు 9 విభాగాల్లో అవార్డులు అవసరం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ అలివేలు మంగతాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కె దుర్గాప్రసాద్, ఈవోపీర్డీ వై ముని రాజు, సీనియర్ అసిస్టెంట్ మూర్తి , ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: గ్రామ పంచాయతీలు ప్రజల ఉన్నతి కోసం అన్ని మౌలిక రంగాల్లో గాంధీజీ కలలు కన్న స్వరాజ్యాన్ని తప్పక సాధించాలని ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్‌లు కోరారు. పెంటపాడు మండల పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటపాడు మండలంలోని 9 గ్రామ పంచాయతీలకు ఉత్తమ అవార్డులు వచ్చిన సందర్భంగా ఆయా గ్రామ సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, దర్శిపర్రు ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణ, మండల కార్యాలయ సిబ్బంది, గ్రామ సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్తమ పంచాయతీగా ఎంపికైన సర్పంచ్‌లను అభినందిస్తున్న ఎంపీపీ, తదితరులు


మండలస్థాయి పురస్కారాలు అందుకున్న పంచాయతీ సర్పంచ్‌లు


మహాలక్ష్మీ చెరువు గ్రామ సర్పంచ్ పాలా శ్రీనును సత్కరిస్తున్న దృశ్యం

అత్తిలి: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామ పంచాయతీలకు మండలస్థాయి పురస్కారాలను అందజేశారు. ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు మండలస్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారం అవార్డులు పంపిణీ చేశారు. మండలంలో 9 అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పంచాయతీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులుగా మూడేసి పంచాయతీలు చొప్పున 27 మండల స్థాయి పురస్కారాలను అందజేసామని ఎంపీడీవో వీవీఎస్ రామారావు తెలిపారు. ఈసందర్భంగా అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రామ పంచాయతీల ద్వారా గ్రామీణ ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ మరిన్ని అవార్డులు పొందాలన్నారు. ఈసందర్భంగా మండల స్థాయి పురస్కారాలకు ఎంపికైన గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులను సత్కరించి, మెమెంటోలు అందజేసారు. జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైఎస్ ఎంపీపీలు దారం శిరీషా, సుంకర నాగేశ్వరరావు, ఈవోఆర్డీ ఎం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తణుకు టౌన్: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా వివిధ అంశాలలో ప్రగతి సాధించిన గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు జెడ్పీటీసీ, ఎంపీపీల చేతుల మీదుగా సత్కరించారు. సోమవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తణుకు మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లకు గ్రామంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అవార్డులను అందజేశారు. తేతలి గ్రామ సర్పంచ్ సరెళ్ల క్రాంతి ప్రియ, దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, మహాలక్ష్మీ చెరువు గ్రామ సర్పంచ్ పాలా శ్రీనుల జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీపీ రుద్ర ధనరాజులు శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందించి సత్కరించారు. తహసిల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.